

# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*



# వీడ్కోలు

**"తప్పదా?"** మాధవి దీనంగా అడిగింది.

ఆమె కళ్ళు రెండూ నిండుకుండల్లా ఉన్నాయి. ముక్కు చివర ఎర్రగా మారింది. ఓణీతో మరోసారి ముక్కు తుడుచుకుని చెప్పింది.

"కనీసం రేపు వెళ్తే బావుండేది."

బాలకృష్ణ పరిస్థితి కూడా అలాగే వుంది. కాని ఏమీ చేయలేని నిస్సహాయత.

"నాన్న ఎట్టి పరిస్థితుల్లో రాత్రికి ఉండద్దన్నాడు" దిగులుగా చెప్పాడు.

"పోనీ ఐదున్నర బస్‌కి వెళ్తారా?" ఆశగా అడిగింది.

"విజయవాడ వెళ్ళేసరికి రాత్రవుతుంది. మా ఊరి లాస్ట్ బస్ ఎనిమిదికే. అది వెళ్ళిపోతే కష్టం."

మాధవి మరోసారి ఓణీ అంచుతో ముక్కు తుడుచుకుంది.

బాలకృష్ణ నిస్సహాయంగా చూసాడు.

పదిహేను రోజుల క్రితం పెళ్ళి చూపులయ్యాయి. అబ్బాయి, అమ్మాయి ఒకరికొకరు నచ్చారు. అమ్మానాన్నలకి మిగతావి నచ్చాయి. దాంతో పదిరోజుల క్రితం తాంబూలాలు పుచ్చుకున్నారు. పెళ్ళి ముహూర్తం మరో రెండు నెలలకి కాని కుదరలేదు. వీళ్ళ నక్షత్రాలని బట్టి దగ్గర్లో ఒక్క ముహూర్తం కూడా లేదు. ఆ ఒక్కటైనా ఉన్నందుకు అంతా సంతోషించారు.

ఎక్కడో హుబ్లీలో అబ్బాయి ఉద్యోగం. రైల్వేలో. పెట్టిన సెలవులు అయిపోయాయి. రెండు రోజుల్లో ప్రయాణం. బాలకృష్ణ వాళ్ళ నాన్న దగ్గరకి వచ్చి బెరుకుగా అడిగాడు.

"నాన్నా! మధు వాళ్ళ ఊరువెళ్ళి తనకి చెప్పిరానా? ఎల్లుండే నా ప్రయాణం."

"మధు ఎవర్రా?" ఆయన అయోమయంగా అడిగాడు.

"అదే మాధవి" బాలకృష్ణ సిగ్గుపడ్డాడు.

ఆయన కొడుకులోని ఈ కొత్త కోణాన్ని కొంచెం విస్మయంగా చూసి చెప్పాడు.

"సరే పో. కానీ రాత్రికల్లా ఇంటికొచ్చెయ్. పెళ్ళికాకుండా వాళ్ళింటో నిద్ర చేస్తే బావుండదు."

"సరే" బాలకృష్ణ హుషారుగా చెప్పాడు.

ఉతికిన బట్టల్ని డాబామీద ఆరేస్తున్న మాధవి నల్లకళ్ళజోడు పెట్టుకుని తమ ఇంటివైపే వస్తున్న బాలకృష్ణని ఓ క్షణం గుర్తుపట్టలేదు. మరుక్షణం సిగ్గుతో ఆరేసిన అమ్మచీర వెనక దాక్కుంది. తర్వాతి క్షణం మెట్లు దిగి వాళ్ళమ్మ దగ్గరకి పరిగెత్తుకెళ్ళి చెప్పింది.

"అమ్మా! ఆయనొస్తున్నారే"

"ఎవరు? కాంపౌండరా? అన్నయ్య జ్వరం తగ్గిందని చెప్పు" వంటపనిలో సతమతమౌతున్న ఆవిడ విసుగ్గా చెప్పింది.

"ఛీ. కాదే అదే బాలకృష్ణగారు" నును సిగ్గుగా చెప్పింది

ఆవిడ ఓ క్షణం అయోమయంగా చూసింది. తర్వాత ఇంటివెనక గొడ్లసావడిలో వున్న భర్తని కేకేసింది.

"ఇదిగో. పెళ్ళికొడుకు వస్తున్నాడంట. నువ్వు కాళ్ళూచేతులు కడుక్కునిరా."

"ఎటూ కాకుండా ఇప్పుడెందుకు వస్తున్నట్లు?" ఆయన అక్కడినించే అరిచాడు.

"అడుగుదాం కాని ముందు రావయ్యా" ఆవిడ విసుక్కుంది.

బాలకృష్ణ బెరుగ్గా లోపలికి అడుగుపెట్టాడు. వసారాలో కూర్చుని పేపర్ చదువుకుంటున్న మాధవి అన్నయ్య మర్యాదగా లేచి చెప్పాడు.

"రండి బావగారు. మంచి ఎండలో బయలుదేరారు?"

"మీ ఊరికి బస్సులు సరిగ్గా లేవు" బాలకృష్ణ అలసటగా చెక్క కుర్చీలో కూర్చుంటూ చెప్పాడు.

"అమ్మా నాన్న కులాసానా బాబూ?" మాధవి తండ్రి పలకరించాడు.

"కులాసేనండి. నేను ఎల్లుండి హుబ్లీ వెళ్ళిపోతున్నాను. మళ్ళీ పెళ్ళికే వచ్చేది. అందుకని ఓసారి కలిసిపోదామని.." బాలకృష్ణ నీళ్ళు నమిలాడు.

"అయ్యో! మాధవి లేదుగా? స్నేహితురాలి పెళ్ళని తెనాలి వెళ్ళింది" మంచినీళ్ళు గ్లాసు అందిస్తూ మాధవి వదిన చెప్పింది.

బాలకృష్ణ అదిరిపడ్డాడు. ఏం మాట్లాడాలో తెలీక గ్లాసెత్తి గటగట మొత్తం నీళ్ళన్నీ తాగేసాడు. ఇంతలో మాధవి కాఫీ గ్లాస్‌తో వచ్చి సిగ్గుపడుతూ అందించింది. బాలకృష్ణ ఆనందంగా దాన్ని అందుకుని ఆ ఆనందంలో అబద్ధం చెప్పిన అక్కయ్యగారిని క్షమించేసాడు.

వాళ్ళిద్దర్నీ ఏకాంతంగా ఉంచి మిగిలినవారు ఇంట్లోకి వెళ్ళిపోయారు.

"రెండు నెలలదాకా రానుకదా. ఓసారి నిన్ను కలిసి వెళ్దామనిపించింది." బాలకృష్ణ సంజాయిషీగా చెప్పాడు.

మాధవి సిగ్గుగా నవ్వింది.

"నీకు ఉత్తరం రాద్దామనుకున్నాను. కానీ మీవాళ్ళు ఏమనుకుంటారోనని భయపడ్డాను."

"అంటే ఈ రెండు నెలలు లెటర్ కూడా రాయరా? ఇందులో అనుకోడానికి ఏముంది?" మాధవి నిరాశగా అడిగింది.

"నువ్వు పర్లేదంటే రాస్తాను నీ అడ్రస్ ఇవ్వు. మరి నాకు రిప్లై ఇవ్వాలి"

మాధవి మళ్ళీ సిగ్గుగా తలాడించింది.

"అక్కడంతా కన్నడం మాట్లాడతారు. తెలుగువాళ్ళు ఎక్కువే అనుకో. నీకు ఇంగ్లీష్‌లో మాట్లాడటం వస్తుందా?" ఖాళీ కాఫీగ్లాస్ ఇస్తూ అడిగాడు.

"సరిగ్గా రాదు. నాది తెలుగు మీడియం బి.ఏ"

"పర్లేదు. నాలుగునెలల్లో కన్నడం వచ్చేస్తుంది"

కొద్దిసేపు మౌనంగా ఉండిపోయారు ఇద్దరూ.

ఏదో మాట్లాడాలని తపన ఏం మాట్లాడాలో అర్థం కావడంలేదు. బిడియం. దారి వెంట పోయేవాళ్ళు వీళ్ళని ఆసక్తిగా చూస్తూ వెళ్తున్నారు.

"ఎండగా వుంది. లోపలికి వెళ్దాం రండి" మాధవి చెప్పింది.

ఈలోగా మాధవి అన్నయ్య నీళ్ళ బక్కెట్‌తో వచ్చి చెప్పాడు.

"కాళ్ళూ చేతులు కడుక్కోండి. భోం చేద్దాం"

భోజనాలయ్యాక మాధవి అతడ్ని తన గదిలోకి తీసుకెళ్ళింది.

"నీకో స్పెషల్ రూం ఉందా? మా ఇంట్లో అలాంటివేం లేవు. అందరం హాల్లో మంచాలువేసుకు పడుకుంటాం" చుట్టూ చూసి చెప్పాడు బాలకృష్ణ.

"అవును చదువుకోడానికి, పడుకోడానికి గది ఉండాలని అన్నయ్య ఈ గది బాగుచేసి నాకిచ్చాడు. అంతకు ముందు ఇందులో మినుముల బస్తాలు, వడ్ల బస్తాలు ఉండేవి" మాధవి చెప్పింది.

అప్పటికి ఇద్దరి మధ్య ఉన్న బెరుకు, బిడియం తగ్గాయి. బాలకృష్ణ తన ఉద్యోగం గురించి, మాధవి తన కాలేజ్ గురించి బోల్డు కబుర్లు చెప్పుకున్నారు.

మధ్యాహ్నం మూడింటికి మాధవి తల్లి పిలిస్తే వెళ్ళి పకోడీలు పళ్ళెం, మంచినీళ్ళ గ్లాసులతో వచ్చింది. బాలకృష్ణ మొహమాట పడుతూనే తినేసాడు.

"మీరు టీ తాగుతారా? కాఫీనా?" అడిగింది.

"కాఫీనే. టీ అలవాటు లేదు"

కాఫీ తాగాక గడియారం చూసుకుని చెప్పాడు.

"ఇంక బయలుదేరతాను నాలుగింటికి బస్ ఉందని, నేనొచ్చిన బస్ కండక్టర్ చెప్పాడు."

"అప్పుడేనా?" మాధవి నిరుత్సాహంగా అడిగింది.

"తప్పదు."

ఇద్దేరూ లేచి బయటకు వచ్చారు.

"అమ్మా! ఆయన వెళ్తారుట" రుద్ధ కంఠంతో చెప్పింది మాధవి.

అన్నయ్య వెళ్ళి బస్సెక్కించి వస్తాడ్లే పదినిమిషాల్లో వస్తాడు. బజార్‌కి వెళ్ళాడు. అమ్మా నాన్నలని అడిగినట్లు చెప్పు బాబూ" ఆవిడ చెప్పింది.

ఇద్దరూ వసారాలోకి వచ్చారు. మాధవికి చెప్పలేని బాధతో కళ్ళు నిండుకుంటున్నాయి.

"తప్పదా?" మరోసారి అడిగింది.

ఇరవైనాలుగేళ్ళ బాలకృష్ణ అటూ ఇటూ చూసి చటుక్కున మాధవి బుగ్గమీద ముద్దుపెట్టాడు.

పద్దెనిమిదేళ్ళ మాధవి ముందు కంగారు పడినా చెంపమీద ఆ చిరువెచ్చటి స్పర్శని ఆస్వాదిస్తూండిపోయింది.

నాలుగింటి బస్‌లో వెళ్తున్న బాలకృష్ణలో ఎన్నో మధురూహలు. తన గదిలో మంచం మీద వాలిన మాధవి పదే పదే తన చెంపని స్పృశిస్తూ 'మరీ అల్లరబ్బాయ్ బాబూ' అని సిగ్గుపడిపోయింది.

"ఆ చిన్నాడు మరి రౌడీ వెధవలా తయారవుతున్నాడు. మొన్న మా ఆఫీస్ ఆయనకి సిగరెట్ తాగుతూ కనిపించాట్ట. ఇంట్లో ఉండి ఏం చేస్తున్నావ్? పిల్లల సంగతి పట్టించుకోవచ్చుగా?" ఏభై ఏళ్ళ బాలకృష్ణ ఇంటి కప్పెగిరిపోయేట్లు అరుస్తున్నాడు.

"ఇంట్లో ఉన్నంతసేపు బాగానే ఉంటారు. వాళ్ళు బయటకి వెళ్ళి ఏం వెలగబెడుతున్నారో నాకేం తెలుస్తుంది?" నలభైనాలుగేళ్ళ మాధవి అంతకంటే పెద్దగా అరిచింది.

"పెద్దాడు పొద్దున వెళ్తే రాత్రి పదింటిదాకా ఇంటికి రావడం లేదు. జీతంలోంచి ఒక్క పైసా కూడా ఇవ్వడంలేదు. ఏం చేస్తున్నాడో గట్టిగా అడుగు."

"ఎందుకు? అడిగి నేను చెడ్డదాన్నవాలా? ఆదివారం రోజు మీరే అడగండి."

"ఎడ్డెమంటే తెడ్డెమంటావ్. ఇది ఇల్లుకాదు నరకం" బాలకృష్ణ ఉగ్రంగా చెప్పాడు.

"మీరు యమధర్మరాజులాగా అరుస్తూంటే ఇల్లు నరకమే మరి." మాధవి దీర్ఘాలు తీసింది.

"ఛీ" తలుపు తీసుకుని బయటకి వెళ్ళిపోయాడు బాలకృష్ణ.

"మా రవి పెళ్ళి పదిహేనో తారీకున. అక్కయ్య ఫోన్ చేసింది. మనల్ని వారం ముందే రమ్మంది" బాలకృష్ణ చెప్పాడు.

"మరి నాకూ ఫోన్ చేసి చెప్పచ్చుగా? ఎస్‌టిడి అంటే లక్షల బిల్ అవుతుందనుకుంటారు. ఎప్పుడూ పదిహేనా? అమ్మాయికి పరీక్షలు. మీరెళ్ళి రండి" మాధవి చెప్పింది.

"అది చదువుకుంటుందిలే. నువ్వు రాకపోతే బావుండదు"

"నిజమే కాని టెన్త్ క్లాస్ పరీక్షలాయె. నేనురాను.

మీ అన్నయ్య కూతురి పెళ్ళయితే ఎగురుకుంటూ వెళ్ళేదానివి."

"నాకా పక్షపాతాలేమీలేవు. రైలు టిక్కెట్ ఫ్రీ అని అన్నిటికీ పిలుస్తారు. వెళ్ళకపోతే నిష్టూరాలు. ఎన్ని చూసుకోవాలి ప్రయాణం అంటే? మీరెన్నయినా చెప్పండి. నేను రాను."

"ఐతే నేను వెళ్తాను. పదో తారీకు వెళ్ళి ఇరవయ్యో తారీకు వస్తాను" బాలకృష్ణ ఉక్రోషంగా చెప్పాడు.

"లక్షణంగా వెళ్ళండి. ఇరవైన కాకపోతే వాళ్ళకి పుట్టిన పిల్లాడి బారసాల చూసిరండి." మాధవి వెటకారంగా చెప్పింది.

"వీడు కొంపలోంచి ఎప్పుడూ పోతాడా అని చూడడమే. నీకు మరీ లక్ష్యం లేకుండా పోతోంది" బాలకృష్ణ కోపంగా చెప్పాడు.

"నాకు కల్లో కూడా ఆ ఆలోచన లేదు. అంత చెడ్డదాన్నేం కాదు" మాధవి చెప్పింది.

పదో తారీకున బేగ్ సర్దుకుని చెప్పాడు బాలకృష్ణ.

"డ్యూటీ అయ్యాక స్టేషన్‌లోనే ఏదో తిని రైలెక్కేస్తాను"

"సరే. జాగ్రత్తగా వెళ్ళిరండి" మాధవి చెప్పింది.

"ఇరవయ్యో తారీకు పొద్దున ఆరింటికల్లా వస్తా."

"అలాగే. కనపడితే చక్రకేళి అరటిపళ్ళు తెండి"

"చూస్తా"

తలుపువేసుకుని అనుకుంది మాధవి.

"అమ్మయ్య! పదిరోజులు నస, సతాయింపు వినక్కర్లేదు"

ఆ సాయంత్రం రైలు ఎక్కిన బాలకృష్ణ అనుకున్నాడు.

"పది రోజులు రెస్ట్. ఆ నరకం నించి తాత్కాలిక విముక్తి"

చిత్రంగా ఇద్దరిలో ఒక్కరికి కూడా ఇరవై ఆరేళ్ళ కిందటి వీడ్కోలు సంఘటన గుర్తురాలేదు.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments